సాక్షి ప్రకాశం

సోమవారం । 13 । మే । 2024



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించడంతో పాటు తగినంత వైద్య సిబ్బందిని, అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చింది. 108, 104 సర్వీసులతో గ్రామీణ ప్రాంతాలకూ వైద్యాన్ని చేరువ చేసింది.

గరిష్టం/కనిష్టం
40/29

వాతావరణం
ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

గోల్ కొట్టేందుకు..సిద్ధం



సార్వత్రిక సమరంలో కీలక ఘట్టం పోలింగ్‌కు అన్ని రాజకీయ పార్టీలు సిద్ధమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి ప్రచార పర్వం ముగిసే వరకూ అభ్యర్థులందరూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఉధృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. అందులో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 58 నెలల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ రాజకీయ పార్టీలకు 165 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒంగోలు పార్లమెంట్‌కు 25 మంది అభ్యర్థులు, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 140 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గంలో 14 మంది, దర్శిలో 11, సంతనూతలపాడులో 14, ఒంగోలులో 26, కొండపిలో 15, మార్కాపురంలో 27, గిద్దలూరులో 21, కనిగిరి నియోజకవర్గంలో 12 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. పోటీలో నిలిచిన వారిలో వైఎస్సార్ సీపీ నుంచి ఒంగోలు పార్లమెంట్ స్థానానికి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒంగోలులో బాలినేని శ్రీనివాసరెడ్డి, కొండపిలో ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడులో మేరుగు నాగార్జున, మార్కాపురంలో అన్నా వెంకట రాంబాబు, గిద్దలూరులో కుందురు నాగార్జునరెడ్డి, దర్శిలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెంలో తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరిలో దద్దాల నారాయణ ఉన్నారు. అదే విధంగా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, రిజిస్టర్ అయి గుర్తింపు లేని పార్టీలతోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

- పూర్తి వివరాలు .. - IIలో..

గ్రామ స్వరాజ్యం..
ప్రగతి దేదీప్యం

ప్రజా సంక్షేమమే అభివృద్ధికి కొలమానం.. తల పండిన ఆర్థికవేత్తలు సైతం అంగీకరించే సత్యమిది. సమాజంలో పేదరికాన్ని జయించేందుకు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.. అదే సమయంలో శాశ్వత అభివృద్ధి పనులనూ చేపట్టి జిల్లాను ప్రగతి పథాన నిలిపింది. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుసాధ్యం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే పరిపాలన తీసుకొచ్చారు.

– సాక్షి ప్రతినిధి, ఒంగోలు


నిర్మాణం పూర్తయిన వెలిగొండ ప్రాజెక్టు సొరంగం


మార్కాపురంలో జగనన్న కాలనీలో విద్యుత్ వెలుగులు

- సంక్షేమం, అభివృద్ధి జోడు గుర్రాలుగా వైఎస్సార్ సీపీ పాలన
- జిల్లాలో మెరుగుపడిన ప్రజల జీవన ప్రమాణాలు
- ప్రాజెక్టుల కోసం రూ.1122.64 కోట్లు ఖర్చు చేసిన వైనం
- వరప్రదాయిని 'వెలిగొండ' పూర్తి
- నాడు–నేడు కింద రెండు దశల్లో 1992 స్కూళ్ల అభివృద్ధికి రూ.393.23 కోట్లు
- వ్యవసాయ, గృహ, పరిశ్రమల విద్యుత్ అవసరాలకు రూ.346.60 కోట్లు
- ఆర్‌బీకేలు, గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి రూ.580 కోట్లు
- నవరత్నాలు పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో రూ.17934 కోట్లు జమ

సొంతింటి కల సాకారం

నవరత్నాలుపేదలందరికీ ఇళ్లు పథకానికి జిల్లాలో 1,01,422 మంది దరఖాస్తు చేసుకోగా 96,604 మందిని లబ్ధిదారులుగా గుర్తించి ఇళ్ల పట్టాలు అందజేశారు. అందుకోసం 2050.36 ఎకరాల ప్రభుత్వ భూమి, 1041.11 ఎకరాల ప్రైవేట్ భూమి.. మొత్తం 3,091.47 ఎకరాలు సేకరించి 1,015 జగనన్న లేఔట్లు ఏర్పాటు చేశారు. భూ సేకరణ కోసం రూ.277.6 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో 74 వేల మందికి గృహాలు మంజూరు చేశారు. గృహ నిర్మాణాల కోసం రూ.1331.87 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 25 వేల గృహాలు నిర్మాణం పూర్తి కాగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. జగనన్న లేఔట్లలో పూర్తి స్థాయిలో అంతర్గత రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మరో రూ.62.74 కోట్లు వెచ్చించింది.


నాడు-నేడుతో రూపుమారిన ఇలపావులూరు ఎంపీయూపీ స్కూల్

ప్రజ్వల విద్యా కాంతి

గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కునారిల్లుతున్న ప్రభుత్వ పాఠశాలలు సీఎం వైఎస్ జగన్ చేపట్టిన నాడు–నేడుతో కొత్త రూపు సంతరించుకున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన 1992 పాఠశాలలను ఆధునీకరించేందుకు నాలుగు విడతల్లో రూ.599.71 కోట్లు వెచ్చించారు. మొదటి విడతలో 1015 పాఠశాలను ఆధునీకరించేందుకు రూ.210.82 కోట్లు, రెండో విడతలో 977 పాఠశాలలకు రూ.417.29 కోట్లు, మూడో విడతలో 924 పాఠశాలలకు రూ.159.75 కోట్లు, నాలుగో విడతలో 1069 పాఠశాలలకు రూ.22.67 కోట్లు ఖర్చు చేశారు.


ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూం

ప్రాజెక్టులకు రూ.1122.64 కోట్లు

జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1122.64 కోట్లు వెచ్చించింది. జిల్లాకు జీవధార అయిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు కోసం రూ.975.98 కోట్లు ఖర్చు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ప్రాజెక్టులో భాగమైన రెండు సొరంగాల పనులు పూర్తి చేసి 2024 మార్చి 6 తేదీన సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రజలకు అంకితం చేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు రూ.24.74 కోట్లు, జిల్లాలో మిగతా ప్రాజెక్టుల కోసం రూ.121.94 కోట్లు వెచ్చించారు.

సాగుకు సాయం

జిల్లాలో సాగు నీటి చెరువుల అభివృద్ధికి 2019లో రూ.15.79 కోట్లు, 190221లో రూ.9.58 కోట్లు, 202122లో రూ.1.96 కోట్లు, 202223లో రూ.2.58 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. మొత్తం మీద గడిచిన ఐదేళ్లలో రూ.21.28 కోట్లు వెచ్చించారు. వైఎస్సార్ జలకళ కింద జిల్లాలో 1774 వ్యవసాయ బోర్ల నిర్మాణానికి రూ.7.17 కోట్లు ఖర్చు చేశారు.



కరోనా విలయంలో సర్కారు సంజీవని

కరోనా ప్రభావంతో దేశమంతా విలవిల్లాడుతున్న తరుణంలో వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. బాధితులకు అండగా ఉండి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఉపాధి కోల్పోయిన వారికీ ఆర్థిక చేయూతనందించింది. కరోనా కేసులు నమోదైన ప్రాంతాలను రెడ్ జోన్‌గా ప్రకటించి వైరస్ ఇతరులకు సోకకుండా పటిష్ట చర్యలు చేపట్టింది. వైరస్ బారినపడిన వారిని గుర్తించేందుకు విస్తృతంగా ఉచితంగా పరీక్షలు నిర్వహించింది. అందుకోసం ప్రత్యేకంగా సంజీవని బస్సులను సైతం ఏర్పాటు చేసింది. కరోనా బాధితులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లి ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం చేయించింది. ఒంగోలులోని జీజీహెచ్(రిమ్స్), మార్కాపురం జిల్లా వైద్యశాలల్లో కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతోపాటు అత్యాధునిక వసతులు కల్పించింది. ఒంగోలు జీజీహెచ్‌లో రూ.4.5 కోట్లతో 3 ఆక్సిజన్ ప్లాంట్లు, మార్కాపురంలో రూ.3 కోట్లతో 2 ఆక్సిజన్ ప్లాంట్లను, ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసింది. క్వారంటైన్‌లో ఉన్న వారికి పౌష్టికాహారం అందించింది. కరోనా సమయంలో పేదలకు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా రేషన్ కార్డుదారులకు రూ.1000 చొప్పున అందించడం, మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసు చాటుకుంది. కరోనా సమయంలో ఇంటిలో నుంచి ఎవరూ బయటకు రాలేని స్థితిలో వలంటీర్ల ద్వారా బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు, మందులను నేరుగా ఇళ్ల వద్దకే చేర్చింది. పోలీసులు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది అంకితభావంతో సేవలందించారు.


ఒంగోలు రిమ్స్‌లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కోవిడ్ కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ సౌకర్యం ఉన్న బెడ్స్‌పై చికిత్స పొందుతున్న కోవిడ్ బాధితులు (ఫైల్)

లబ్ధిదారుల ఖాతాలకే నిధుల జమ

సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నేరుగా నిధులు జమ చేయడం ద్వారా దళారీ వ్యవస్థకు సీఎం వైఎస్ జగన్ చెక్ పెట్టారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ), నాన్ డీబీటీ కింద లబ్ధిదారులకు నిధుల బదిలీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అడ్డంకులు లేకుండా సాగింది. తద్వారా నిరుపేదలకు నవరత్నాలు పథకాలు చేరువయ్యాయి. గడిచిన ఐదేళ్లలో 17 సంక్షేమ పథకాల కింద రూ.17,934.65 కోట్లను నేరుగా పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కిడ్నీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించి అండగా నిలిచింది.

జిల్లాలో సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	లబ్ధి(రూ.కోట్లలో)
డీబీటీ		
జగనన్న అమ్మ ఒడి	2,09,776	1249.47
వైఎస్సార్ ఆసరా	3,08,258	937.96
వైఎస్సార్ చేయూత	119314	593.70
జగనన్న విద్యా దీవెన	13624	54.49
జగనన్న వసతి దీవెన	12341	49.36
నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు	73993	1331.87
వైఎస్సార్ సున్నావడ్డీ(ఎస్‌హెచ్‌జీ)	420980	245.68
వైఎస్సార్ కాపు నేస్తం	8,707	48.88
ఈబీసీ నేస్తం	39,409	172.02
కల్యాణమస్తు షాదీతోఫా	1,901	16.91
వైఎస్సార్ పెన్షన్ కానుక	2,97,558	4984.01
వైఎస్సార్ రైతు భరోసా	2,84,113	1634.85
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	197966	492.52
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	50378	23.27
జగనన్న చేదోడు	194868	197.51
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	99588	60
వైఎస్సార్ నేతన్న నేస్తం	769	7.94
వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు	420980	245.68
వైఎస్సార్ వాహనమిత్ర	10176	64.08
నాన్ డీబీటీ		
జగనన్న తోడు	18497	55.49
వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టాలు	66325	3059.68
జగనన్న గోరుముద్ద	200692	166.52
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	152384	285.42
జగనన్న విద్యా కానుక	217080	165.48
డీబీటీ+నాన్ డీబీటీ లబ్ధి		16,142.79

మెడికల్ హబ్‌గా మార్కాపురం



పశ్చిమ ప్రకాశంలో డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణం మెడికల్ హబ్‌గా మారనుంది. మార్కాపురానికి కూతవేటు దూరంలో ఉన్న రాయవరం వద్ద 50 ఎకరాల్లో వైద్య కళాశాల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం రూ.475 కోట్లు మంజూరు చేసింది. కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. రాబోయే విద్యా సంవత్సరంలో కళాశాల తరగతులు ప్రారంభించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అంతే కాకుండా మార్కాపురం జిల్లా వైద్యశాలను రూ.18 కోట్లు వెచ్చించి ప్రభుత్వం అభివృద్ధి చేసింది. టీడీపీ హయాంలో ఇక్కడ 8 మంది వైద్యులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 21కు పెంచారు. రూ.8 కోట్లతో 232 అదనపు బెడ్లు, రూ.6 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్లు అందుబాటులోకి తెచ్చారు. రూ.3 కోట్లతో వీఆర్‌డీఎల్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. త్వరలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ కూడా రానుంది. ఇప్పటికే మొదటి అంతస్తు, లేడీస్ హాస్టల్ నిర్మాణాలు పూర్తయ్యాయి.

➤ దోర్నాలలో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేయగా నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

ఒంగోలుకు నిధుల వరద

ఒంగోలు నగరంలో దాదాపు 3.15 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. నగరంలో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. శివారు కాలనీల్లో సైతం అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. నగరంలో 25 వేల మంది పేదల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి విశేష కృషి చేశారు. రూ.210 కోట్లు వెచ్చించి అగ్రహారం, వెంగముక్కలపాలెం సమీపంలో 410 ఎకరాలు సేకరించి ఇటీవల సీఎం వైఎస్ జగన్ చేతులమీదుగా 21 వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయించారు. నగరంలో మంచినీటి వ్యవస్థను సమూలంగా మార్చేందుకు ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేయగా టెండర్ దశ పూర్తయింది.

మార్గం.. సుగమం

రోడ్లు, భవనాల శాఖ పరిధిలో జిల్లాలోని రహదారుల అభివృద్ధికి గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రూ.559.28 కోట్లు ఖర్చు చేసింది. బేస్తవారిపేట–ఒంగోలు హైవే మరమ్మతులతోపాటు, కనిగిరి–కందుకూరు హైవే నిర్మాణం, లింక్ రోడ్ల అభివృద్ధికి నిధులు వెచ్చించింది. రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేసినా ప్రతిపక్షాలు అదే పనిగా అబద్ధాలు వల్లె వేస్తూ ప్రజలను నమ్మించేందుకు చేసిన కుటిల యత్నాలు విఫలమయ్యాయి.

'పవర్' ఫుల్‌గా ఉమ్మడి ప్రకాశం

వ్యవసాయ, అనుబంధ రంగాలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.346.60 కోట్లు ఖర్చు చేసింది. పగటి పూట వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా 32 విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించారు. 47,747 వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం రూ.169.19 కోట్లు వెచ్చించారు. అదనపు లోడ్ కోసం రూ.7.22 కోట్లు, ఇతర విద్యుత్ అవసరాల కోసం రూ.17.82 కోట్లు, 33 కేవీ విద్యుత్ లైన్లలో మరమ్మతుల కోసం రూ.83.51 లక్షలు, 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులకు రూ.613 కోట్లు, ఎల్‌టీ లైన్లలో మరమ్మతులకు రూ.17.4 కోట్లు, ఇంకా అవసరమైన చోట పనులకు రూ.70.59 కోట్లు ఖర్చు చేశారు.


ఆరవీటికోటలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం

ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు

కార్యాలయం	మంజూరైన భవనాలు	ఖర్చు చేసిన నిధులు (రూ.కోట్లలో)
గ్రామ సచివాలయాలు	591	226.20
రైతు భరోసా కేంద్రాలు	593	129.27
వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	492	86.10
డిజిటల్ లైబ్రరీలు	228	36.48

సంక్షేమానికే సిద్ధం!

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం

అభ్యర్థి : డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
పార్టీ : వైఎస్సార్ సీపీ

డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నమ్మిన వారికోసం ఎందాకైనా పోరాటం చేస్తారన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. ఐదేళ్లకోమారు పార్టీలు మారే తీరు కాదనే భావన, పట్టుబట్టి ప్రజలకు అవసరమైన పనులు పూర్తి చేస్తారన్న పేరు ఉన్నాయి. అన్ని సామాజిక వర్గాల ప్రజలతో మమేకం కావడం, అందరికీ అందుబాటులో ఉండటం, ఆదపలో సాయం చేసే గుణం చెవిరెడ్డికి కలిసొచ్చే అంశాలు. వైఎస్సార్ సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చెవిరెడ్డికి ఉన్న అనుబంధం చెవిరెడ్డికి అదనపు బలం.

అభ్యర్థి : మాగుంట శ్రీనివాసులురెడ్డి
పార్టీ : టీడీపీ

పదవి కోసం తరచూ పార్టీలు మారుతారన్న అపవాదును మాగుంట శ్రీనివాసులురెడ్డి మూటగట్టుకున్నారు. తొలుత కాంగ్రెస్, ఆ తర్వాత టీడీపీ, అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ, తాజాగా మరో మారు టీడీపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న ఆయన ప్రజల్లో క్రమంగా విశ్వాసం కోల్పోయారని విశ్లేషకుల అభిప్రాయం. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఒంగోలు నగరంలోని ధారావారితోటలో గుడిసెవాసుల స్థల సమస్యను పరిష్కరిస్తానంటూ గత 35 ఏళ్లుగా చర్చల పేరుతో కాలయాపన చేయడం మాగుంట పనితీరును తేటతెల్లం చేస్తోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కేసీఆర్ కుమార్తె కవిత అరెస్టు అయిన లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉన్న మాగుంట తనయుడు రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారడం జిల్లా వాసుల్లో నేటికీ హాట్ టాపిక్.

సార్వత్రిక ఎన్నికల సమరానికి ఎలక్షన్ కమిషన్ సర్వం సిద్ధం చేసింది. పటిష్ట బందోబస్తు నడుమ పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రిని తరలించింది. మరో వైపు ప్రధాన రాజకీయ పార్టీలు అస్త్ర శస్త్రాలతో ఎన్నికల సంగ్రామానికి పాంచజన్యం పూరించాయి. ఎన్నికల యుద్ధంలో కాలర్ ఎగరేసేది ఎవరో ఓటర్లు తేల్చనున్నారు. నేరుగా ఇంటికే చేరిన సంక్షేమ పథకాలు, కళ్ల ఎదుట కనిపిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని అధికార వైఎస్సార్ సీపీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తుండగా.. టీడీపీ శ్రేణులు మాత్రం విజయావకాశాలపై ధీమా వ్యక్తం చేయలేని స్థితిలోకి చేరుకోవడం గమనార్హం. ప్రధాన రాజకీయ ప్రత్యర్థుల బలాలు, బలహీనతలపై ఓటర్లు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు స్పష్టమవుతోంది.

- సాక్షి నెట్‌వర్క్

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం

అభ్యర్థి : బాలినేని శ్రీనివాసరెడ్డి
పార్టీ : వైఎస్సార్ సీపీ

ఒంగోలు ఎమ్మెల్యేగా ఐదు పర్యాయాలు గెలుపొందిన బాలినేని శ్రీనివాసరెడ్డి సిక్సర్ కొట్టేందుకు ఉవిళ్లూరుతున్నారు. గత ఐదేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో నియోజకవర్గ లబ్ధిదారులకు రూ.2 వేల కోట్ల మేర నేరుగా నగదు అందించడంతోపాటు మరో రూ.2 వేల కోట్లకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అభివృద్ధి పనుల్లో ఇప్పటికే సగానికి పైగా నిధులు ఖర్చు చేయడం బాలినేనికి కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. కరోనా సమయంలో బాలినేని చూపిన ఔదార్యం ప్రజల్లో మంచి పేరు తెచ్చి పెట్టింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.230 కోట్ల మేర ఖర్చు చేసి 25 వేల మంది పేద, మధ్య తరగతి ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు బాలినేని చేసిన కృషి ఆయన ఖ్యాతిని రెట్టింపు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజికవర్గాల ఆకాంక్షలు నెరవేర్చడం ఆయా వర్గాలను బాలినేనికి మరింత దగ్గర చేసింది.

అభ్యర్థి : దామచర్ల జనార్దన్
పార్టీ : టీడీపీ

గత ఎన్నికల్లో ఓటమిపాలు కావడంతో కరోనా సమయంలో ప్రజలకు దూరంగా బెంగళూరులో వ్యాపారాలు చేసుకుంటూ ఉండిపోయారన్న విమర్శ దామచర్ల జనార్దన్‌పై ఉంది. 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ శాశ్వత అభివృద్ధి చేశానని చెప్పుకొనే ఒక్క పనీ చేయలేకపోవడం, కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు గుంజి ఇబ్బంది పెట్టాడన్న ఆరోపణలు నేటికీ వెంటాడుతున్నాయి. నీటిపారుదల శాఖకు చెందిన భూమిని తహసీల్దార్‌తో సంబంధం లేకుండా తానే టీడీపీ కార్యకర్తలకు పెళ్లికానుకగా ఇంటి పట్టాలు ఇవ్వడం దామచర్లకు మచ్చ తెచ్చిపెట్టింది. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తుంటే అడుగడుగునా అడ్డుపడుతూ కోర్టులను ఆశ్రయించి ఆపేందుకు శతవిధాలా యత్నించడం, ప్రభుత్వం ఇచ్చిన పట్టాలను దొంగవి అంటూ తప్పుడు ప్రచారం చేయడం, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింల దుకాణాలు ధ్వంసం చేయడం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు మైనారిటీ ఆగ్రహాన్ని మూటగట్టుకున్నారు.



పల్లె.. పట్నం.. ఫ్యానే ఖాయమంటున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

- సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ముందంజ
- ఐదేళ్లుగా నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ జనంతో మమేకం
- కరోనా సమయంలోనూ అందుబాటులో ఉండి అభాగ్యులకు సాయం
- గ్రామాలు, పట్టణాల్లో సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాల లబ్ధి

గెలుపుపై ధీమా వ్యక్తం చేయలేని స్థితిలో టీడీపీ కూటమి నేతలు

- ప్రజల వద్దకు వెళ్లి తాము చేసిన మంచిని చెప్పలేక టీడీపీ అభ్యర్థులు డీలా
- వెంటాడుతున్న అవినీతి, అక్రమాలు, జన్మభూమి కమిటీల ఆగడాలు
- మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ.. వైఎస్సార్ సీపీపై పసలేని విమర్శలకే పరిమితం
- కరోనా విజృంభిస్తున్న వేళ ప్రజలకు దూరంగా టీడీపీ నేతలతో పాటు కేడర్

గిద్దలూరు నియోజకవర్గం

అభ్యర్థి : కేపీ నాగార్జునరెడ్డి
పార్టీ వైఎస్సార్ సీపీ

గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట. గత 58 నెలల్లో 32 వేల మందికి అమ్మఒడి, 47 వేల మందికి రైతు భరోసా, 47 వేల మందికి పింఛన్‌కానుక, చేయూత 34 వేలు, ఆసరా 49 వేల మందికి.. ఇలా అనేక సంక్షేమ పథకాలు గడప వద్దకే అందాయని, విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని, కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి అధునాతమైన వైద్యశాలలు, పూర్తి స్థాయిలో డాక్టర్లు, సిబ్బందిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఏర్పాటు చేశామని వైఎస్సార్ సీపీ అభ్యర్థి తన ప్రచారంలో ప్రజలకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, కాపుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పథకాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని చెబుతూ ముందుకు సాగారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవడంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సఫలమయ్యాయి.

అభ్యర్థి : ముత్తుముల అశోక్‌రెడ్డి
పార్టీ : టీడీపీ

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల మాటున చేసిన అక్రమాలు, రోడ్ల నిర్మాణం పేరుతో కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు దిగమింగడం, కాంట్రాక్టర్లను బెదిరించిన వ్యవహారాలు ముత్తుముల అశోక్‌రెడ్డిని వెంటాడుతున్నాయి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో సైతం పేదల సొమ్ము కాజేశారన్న అపవాదును ఇక్కడి టీడీపీ నేతలు మూటగట్టుకున్నారు. ఒక్క వర్షానికే పునాదులతో సహా కొట్టుకుపోయిన నాశిరకం చెక్‌డ్యామ్‌లు టీడీపీ నేతల అవినీతికి సాక్షీభూతంగా నేటికీ దర్శనమిస్తుండటం ప్రజల్లో ఆ పార్టీని మరింత పలుచన చేసిందని విశ్లేషకుల అభిప్రాయం. గత ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ఏమి చేశారో చెప్పలేక ప్రచారాన్ని చప్పగా ముగించారని స్థానికంగా వినిపిస్తోంది.

మార్కాపురం నియోజకవర్గం

అభ్యర్థి : అన్నా వెంకట రాంబాబు
పార్టీ : వైఎస్సార్ సీపీ

మార్కాపురంలో గత 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న అన్నా వెంకట రాంబాబు స్థానిక ప్రజలందరికీ సుపరిచితుడు. ఆర్యవైశ్య సామాజికవర్గంతో పాటు బీసీలు, ముస్లిం మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీల మద్దతు కూడగట్టడంలో అన్నా సఫలమయ్యాడని స్థానికంగా బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా మార్కాపురం పట్టణంలో ముమ్మరంగా ప్రచారం చేసి ఓటర్లను ఆకర్షించడంలో అన్నా ముందు వరుసలో ఉన్నారు. క్లాస్1 కాంట్రాక్టర్‌గా ఆర్జించిన లాభాల్లో గత 15 ఏళ్లుగా ప్రజలకు విరాళాల రూపంలో ఖర్చు పెట్టడంతో ప్రజల్లో మంచి పేరుంది. ఎవరు కనిపించినా ఆప్యాయంగా మాట్లాడటం, అడిగిన పని చేసిపెట్టడం ఆయనకు కలిసొచ్చే అంశం.

అభ్యర్థి : కందుల నారాయణరెడ్డి
పార్టీ : టీడీపీ

మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు తమ పాలనలో ఏమి చేశారో చెప్పి ఆకట్టుకోవడంలో టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి విఫలమయ్యారన్న మాట బలంగా వినిపిస్తోంది. మార్కాపురం పట్టణంలోని వ్యాపార వర్గాలు గతంలో ఆయన వర్గం నుంచి ఎదుర్కొన్న వేధింపులు నేటికీ కందులను వెంటాడుతున్నాయి. హిమ్ మల్టీ చెయిన్ కుంభకోణం, భూకబ్జాలు, అధికార కార్యక్రమాలు, రాజకీయాల్లో కుటుంబ సభ్యుల మితిమీరిన జోక్యం కందులకు ప్రతికూలంగా ఉన్నాయనేది విశ్లేషకుల మాట. ప్రచారానికి వెళ్లినా ప్రజల నుంచి నామమాత్రపు స్పందన రావడమే అందుకు కారణంగా చూపిస్తున్నారు.

సంతనూతలపాడు నియోజకవర్గం

అభ్యర్థి : మేరుగు నాగార్జున
పార్టీ : వైఎస్సార్ సీపీ

సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారింది. సీఎం వైఎస్ జగన్ గత ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి దాదాపు రూ.2 వేల కోట్లకుపైగా నిధులను సంక్షేమ పథకాల రూపంలో అందించడంతో నియోజకవర్గంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మద్దుత వైఎస్సార్ సీపీకే అధికంగా ఉందన్న మాట వినిపిస్తోంది. అభివృద్ధి కార్యక్రమాలు కూడా మేరుగు నాగార్జునకు కలిసొచ్చే అంశం. నియోజకవర్గ అభ్యర్థిగా సీటు ఖరారైన రెండు నెలల కాలంలోనే సుడిగాలి పర్యటనలు చేపట్టి ప్రజలను ఆకట్టుకోవడంతోపాటు అభివృద్ధిని వివరించడంలో మేరుగు నాగార్జున సఫలమయ్యారన్న మాట బలంగా వినిపిస్తోంది.

అభ్యర్థి : బీఎన్ విజయ్‌కుమార్
పార్టీ : టీడీపీ

గత 24 సంవత్సరాలుగా సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ ఓటమి చవిచూస్తూ వస్తోంది. బలమైన నాయకత్వ లేమి, కేడర్‌లో నిస్తేజం టీడీపీని వెంటాడుతున్నాయి. బీఎన్ విజయ్‌కుమార్ చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన నేతల చేతిలో కీలుబొమ్మ అనే అపవాదును మూటగట్టుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ నేతలు దోచేసిన ప్రజాధనంలో బీఎన్ విజయ్‌కు వాటా ఉందన్న ఆరోపణలు ప్రజల్లో మరింత చులకన చేశాయి. మౌత్ పబ్లిసిటీతో గెలిచేయవచ్చన్న కారణంతో ప్రజల వద్దకు ప్రచారానికి వెళ్లేందుకూ కూడా విజయ్‌కుమార్ ఆసక్తి చూపలేదన్న విమర్శలున్నాయి.

కనిగిరి నియోజకవర్గం

అభ్యర్థి : దద్దాల నారాయణ యాదవ్
పార్టీ : వైఎస్సార్ సీపీ

కనిగిరి అసెంబ్లీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ బీసీ అభ్యర్థికి కేటాయించడంతో బీసీ ఉపకులాలు ఏకతాటిపైకి వచ్చాయి. యాదవ, రెడ్డి, ఎస్సీ, మైనార్టీ, రెడ్డి సామాజికవర్గాల్లో వైఎస్సార్ సీపీకి ముందు నుంచి ఉన్న పట్టును కొనసాగిస్తోంది. నియోజకవర్గంలో 65 శాతం మందికి పైగా సంక్షేమ ఫలాల లబ్ధి పొందడం వైఎస్సార్ సీపీకి కలిసొచ్చే అంశం. దద్దాల నారాయణ సేవా కార్యక్రమాలు, కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండటం, సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ పొందడం, సౌమ్యుడిగా పేరుండటం దద్దాలకు అనుకూల అంశాలని విశ్లేషకులు సైతం పేర్కొంటున్నారు.

అభ్యర్థి : ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి
పార్టీ : టీడీపీ

కనిగిరి నియోజకవర్గంలో టీడీపీ పాత, కొత్త నేతల మధ్య సమన్వయం లేకపోవడం ఆ పార్టీ శ్రేణులను నైరాశ్యానికి గురి చేస్తోంది. ఉగ్ర సేన పేరుతో దుందుడుకు చర్యలకు పాల్పడుతుండటంపై ఆ పార్టీలోని సీనియర్ నేతలే లోలోపల రగిలిపోతున్నారు. టీడీపీ జమానాలో కనిగిరి నియోజకవర్గంలో నీరు చెట్టులో భారీ అవినీతి, భూకబ్జాలు, వ్యాపారులపై వేధింపులు ఉగ్రను వెంటాడుతున్నాయి. కరోనా కష్టకాలంలో టీడీపీ శ్రేణులుగానీ, స్వయంగా డాక్టరైన ఉగ్రగానీ ప్రజలకు అందు బాటులో లేకపోవడం తదితర అంశాలు ప్రజలను ఆలోచింపజేస్తాయన్నది విశ్లేషకుల మాట.

దర్శి నియోజకవర్గం

అభ్యర్థి : బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి
పార్టీ : వైఎస్సార్ సీపీ

దర్శి నియోజకవర్గంలో గడిచిన 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా ఉండటం బూచేపల్లి శివప్రసాద్ రెడ్డికి కలిసొచ్చే అంశం. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల రూపంలో పేదలకు రూ.2 వేల కోట్ల వరకు అందించడం ద్వారా ఆయా వర్గాల ప్రజల నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. బూచేపల్లి కుటుంబంపై ఎక్కడా అవినీతి మచ్చలేకపోవడం, నియోజకవర్గంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు బూచేపల్లి చేసిన కృషి, ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్, గురుకుల పాఠశాలలు అభివృద్ధికి చేపట్టిన చర్యలు ప్రజల్లో పేరు తెచ్చాయి.

అభ్యర్థి : గొట్టిపాటి లక్ష్మి
పార్టీ : టీడీపీ

నరసరావుపేట నుంచి వచ్చి దర్శిలో పోటీ చేస్తున్న గొట్టిపాటి లక్ష్మిని స్థానికేతరురాలనే కారణంతో టీడీపీ శ్రేణులే వ్యతిరేకించాయి. ప్రచారంలో లక్ష్మి చేసిన వ్యాఖ్యలు మరింత వ్యతిరేకతను మూటగట్టుకునేలా చేశాయన్నది విశ్లేషకుల అభిప్రాయం. సొంత సామాజికవర్గంలోనూ ఆశించిన ఆదరణ లేకపోవడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలతో పాటు కాపులు దూరంగా ఉండటం, ప్రజలకు ఏం మంచి చేస్తామో చెప్పి ఆకట్టుకోవడంలో విఫలం చెందడం టీడీపీకి ప్రతికూల అంశాలని స్థానికంగా వినిపిస్తోంది.

యర్రగొండపాలెం నియోజకవర్గం

అభ్యర్థి : తాటిపర్తి చంద్రశేఖర్
పార్టీ : వైఎస్సార్ సీపీ

యర్రగొండపాలెం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోటగా ఉంది. యర్రగొండపాలెం గడ్డపై మరోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం ఖాయమని ఆ పార్టీ నేతలు మరింత ధీమా వ్యక్తం చేస్తున్నారు. నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల రూపంలో నియోజకవర్గంలో పేద, మధ్య తరగతి ప్రజలకు రూ.2 వేల కోట్ల మేర చేకూరిన లబ్ధి, స్థానికంగా అన్ని మండలాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గిరిజన సంక్షేమానికి చేపట్టిన చర్యలు, రైతుల ఆశలు నెరవేరుస్తూ టీ–5 కెనాల్ నిర్మాణం, వెలిగొండ పూర్తి చేయడం తదితర అంశాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్‌కు కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అభ్యర్థి : ఎరిక్షన్ బాబు
పార్టీ : టీడీపీ

మేనిఫెస్టోలో ఉన్న హామీలను సైతం ప్రజలకు స్పష్టంగా వివరించలేక టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు ఇబ్బంది పడటం, స్థానికంగా ఉన్న కీలకమైన పార్టీ నేతలతో ఆది నుంచీ ఉన్న విభేదాలు ఆ పార్టీ శ్రేణులను నిరుత్సాహానికి గురిచేస్తున్నాయి. నియోజకవర్గంలోని రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ సామాజికవర్గాలు టీడీపీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను ఆ పార్టీ నేతల ఎదుటే కడిగిపారేయడం, చంద్రబాబు గత హామీలను అమలు చేయని తీరు, టీడీపీ ప్రభుత్వంలో చేసిన అవినీతి, అక్రమాలు ఎరిక్షన్‌బాబును కలవరపెడుతున్నాయనే వాదన స్థానికంగా బలంగా వినిపిస్తోంది.

కొండపి నియోజకవర్గం

అభ్యర్థి : ఆదిమూలపు సురేష్
పార్టీ : వైఎస్సార్ సీపీ

కొండపి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరించడంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ సఫలమయ్యారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీ, మైనారిటీలు, అగ్రవర్ణాల వారికి ప్రభుత్వం చేసిన మంచిని తెలియజేస్తూ, కార్యకర్తలను చైతన్యపరుస్తూ తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ పొన్నలూరు మండలంలో బస్సుయాత్ర, టంగుటూరులో ఎన్నికల సభ నిర్వహించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన మూడు నెలల్లోనే అభివృద్ధి పనులు చేయడం, ప్రజలకు రూ.1.15 కోట్ల మేర సీఎం రిలీఫ్ చెక్కులు మంజూరు చేయించడంలో చూపిన చొరవ, గత ఐదేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో పేదలకు కలిగిన లబ్ధి, పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు, దాదాపు 30 ఏళ్లుగా సింగరాయకొండ మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో కోదండరామస్వామి దేవస్థానం స్థల సమస్యను పరిష్కరించి ఆర్యవైశ్యులకు అండగా నిలవడం కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయన్నది రాజకీయ విశ్లేషకుల మాట.

అభ్యర్థి : డీబీవీ స్వామి
పార్టీ : టీడీపీ

ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు నెగ్గినా కొండపి నియోజకవర్గానికి డీబీవీ స్వామి చేసింది ఏమిటన్న ప్రశ్న ప్రజల నుంచి ఉత్పన్నమవుతోంది. నియోజకరవ్గంలో శాశ్వత అభివృద్ధి చేశామని ఎన్నికల ప్రచారంలో సైతం చెప్పుకొని పరిస్థితి డీబీవీ స్వామిది. ఆది నుంచీ కొండపి నియోజకవర్గంపై తమ ముద్ర ఉండాలని రాజకీయాలు చేస్తున్న దామచర్ల కుటుంబం స్వామిని కీలుబొమ్మలా ఆడిస్తోందన్న విమర్శలున్నాయి. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ నేతలు చేసిన ప్రయత్నం ఆశించిన ఫలితం ఇచ్చేలా కనిపించడం లేదని, గత ప్రభుత్వంలో నీరు–చెట్టులో చేసిన అవినీతి, 15 వేల మరుగుదొడ్ల నిధులు కాజేయడం, గ్రావెల్, ఇసుక దందాలు, కాంట్రాక్టర్లకు బెదిరింపులు తదితర అంశాలు టీడీపీకి ప్రతికూల అంశాలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

అన్నదాతల హంతకుడు

సరిగ్గా పదేళ్ల క్రితం.. 2014 ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు ఇచ్చిన రుణమాఫీ హామీ అన్నదాతలను ఆనంద డోలికలో ముంచేసింది. బాబు నక్కజిత్తులను కొద్ది కాలానికే అర్థం చేసుకున్న రైతులు తాము చేసిన తప్పిదానికి చింతించారు. రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకుల్లో కుదవపెట్టిన బంగారం విడిపించుకోలేక, పెట్టుబడికి డబ్బులేక, చేసిన అప్పు తీర్చలేక మదన పడిన రైతులకు పురుగు మందే పెరుగన్నమైంది.. ఉరికొయ్యలే ఊయలలయ్యాయి. బాబు ఐదేళ్ల జమానాలో జిల్లాలో 458 మంది రైతులు అర్ధంతరంగా తనువు చాలించారు.

- సాక్షి నెట్‌వర్క్



- రుణమాఫీ పేరుతో రైతులను దారుణంగా వంచించిన చంద్రబాబు
- బ్యాంకులకు అప్పు కట్టవద్దంటూ 2014కు ముందు ఊరూరా డప్పు
- నిజమని నమ్మి వడ్డీ కూడా కట్టకపోవడంతో భారం తడిసి మోపెడు
- చంద్రబాబు ఐదేళ్ల పాలనలో జిల్లాలో సుమారు 458 మంది రైతుల ఆత్మహత్య

బాబు-కరువు కవల పిల్లలు

టీడీపీ జమానాలో రైతు లోగిళ్లు కళ తప్పాయి. 2014 నుంచి 2019 వరకు ఏటా లోటు వర్షపాతమే నమోదై కరువు–బాబు కవల పిల్లలు అనే మాటను నిజం చేసింది. తీవ్ర వర్షాభావం కారణంగా పంటలు సాగు చేసినా దిగుబడి రాక.. పెట్టుబడి కూడా దక్కక రైతులు విలవిల్లాడారు. కరువు తీవ్ర రూపం దాల్చడంతో జిల్లాలో 4 లక్షల మంది రైతులు, కూలీలు బతుకుదెరువు కోసం చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు వలస వెళ్లిన దుస్థితి. కందుకూరు, కనిగిరి ప్రాంతాల రైతులు హైదరాబాద్ లాంటి నగరాల్లో జ్యూస్ షాపుల్లో పనిచేశారంటే నాటి పరిస్థితి ఎలా ఉందో అవగతమవుతుంది. పంట నష్ట పరిహారం ఇవ్వడంలో, ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరులో బాబు సర్కారు నిర్లక్ష్య వైఖరి రైతులను మరింత కష్టాల్లోకి నెట్టింది.

458 మంది రైతులు బలి

చంద్రబాబు మాటలు విని బ్యాంకుల్లో బంగారం కుదవపెట్టిన రైతులు.. రుణమాఫీ కాకపోవడంతో అప్పు తీర్చే మార్గం లేక చివరకు ఆస్తులు అమ్ముకున్నారు. ఆస్తులు కుదవపెట్టినా అప్పులకు సరిపోని 458 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కానీ నాటి ప్రభుత్వం 58 మంది రైతులే ఆత్మహత్య చేసుకున్నట్లు తేల్చింది. మిగిలిన వారివి సాధారణ మరణాలని పేర్కొంటూ రైతుల ఆత్మహత్యల సంఖ్యను తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించింది. ఫలితంగా ఆ కుటుంబాలు ఆర్థికంగా మరింత చితికిపోయాయి. మృతులకు పరిహారం కింద ఐదు లక్షల రూపాయలిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం విడతలవారీగా రూ.3.50 లక్షల వరకు ఇచ్చి చేతులు దులుపుకొంది.

అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్ మృతి చెందిన అన్నదాతల కుటుంబాలను ఆదుకున్నారు. ఓ వైపు రైతు సంక్షేమానికి కృషి చేస్తూనే.. అనుకోని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకే చెందేలా రూ.7 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించి, ఆ మేరకు చర్యలు తీసుకున్నారు.


- కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం మోపాడు రెడ్డిపాలెంలో 2015 అక్టోబర్ 1న పొగాకు రైతు వాకుమళ్ల చిన పోలిరెడ్డి(62), కనిగిరి మండలం నిమ్మమహేశ్వరపురంలో 2018 ఏప్రిల్ 23న పారాబత్తుని శ్రీహరి(25), 2018 జూన్ 12న చాకిరాలలో నరాల శ్రీనివాసులరెడ్డి(55) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- మార్కాపురం మండలం జమ్మనపల్లె గ్రామానికి చెందిన కౌలురైతు సింగారెడ్డి పేరారెడ్డి పంటలు సాగుకు చేసిన రూ.10 లక్షల అప్పు తీర్చలేక 2016 డిసెంబర్ 31న ఆత్మహత్య చేసుకున్నారు. తర్లుపాడు మండలం సీతానాగులవరంలో రమణయ్య, కొనకనమిట్లకు చెందిన అంగడి తిరుపతయ్య, పొదిలి మండలం రామాపురానికి చెందిన ఎరుకలయ్య అప్పుల ఊబిలో కూరుకుని అర్ధంతరంగా తనువు చాలించారు.
- పెద్దారవీడు పంచాయతీలోని సిద్దినాయునిపల్లెకు చెందిన మెడతోటి అంకయ్య(45), అలాగే రాచర్ల మండలం ఆకవీడుకు చెందిన రైతు సూర రంగారెడ్డి(46) అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు.
- కొండపి మండలం పెరిదేపి గ్రామంలో కౌలు రైతు మద్దిరాల వెంకటేశ్వర్లు(50) 2018 సెప్టెంబర్ 13న ఆత్మహత్య చేసుకోగా చంద్రన్న బీమా కింద రూ.30 వేలు చేతిలో పెట్టి, పరిహారం కింద ఇవ్వాల్సిన రూ.5 లక్షలు ఎగ్గొట్టారు.
- మర్రిపూడి మండలం అయ్యపురాజుపాలేనికి చెందిన గంగవరపు హరిబాబు 2015 జూలై 12న అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పంట సాగు కోసం తెచ్చిన అప్పు వడ్డీతో కలిపి రూ.8 లక్షలు కావడం, బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కుదువ పెట్టిన బంగారం వేలానికి రావడం, అధికారుల చుట్టూ ఇరవైసార్లు తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో హరిబాబు తనువు చాలించాడు. వాస్తవానికి హరిబాబు కుటుంబం టీడీపీ పుట్టినప్పటి నుంచి మద్దతుగా ఉండేది. సభ్యత్వం ఉన్నవారికి పార్టీ తరఫున పరిహారం ఇవ్వాలి. కానీ అటు ప్రభుత్వం తరఫున, ఇటు పార్టీ నుంచి వారికి ఎలాంటి లబ్ధి చేకూర్చలేదు. ఇలా సామాన్యులను, సొంత పార్టీ కార్యకర్తలను చంద్రబాబు నమ్మించి నట్టేట ముంచారు. ఇలా వందలాది మంది రైతులను చంద్రబాబు ఐదేళ్ల పాలనలో బలయ్యారు.

సాక్షి
ప్రకాశం
7
సోమవారం । 13 । మే । 2024

ఒంగోలు పార్లమెంట్ బ్యాలెట్ నమూనా

Ready

Ballot Unit

వరుస సంఖ్య	అభ్యర్థి పేరు	అభ్యర్థి ఫోటో	గుర్తు	ఓటు
1				
2	డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి			
3				
4				
5				
6				
7				
8				
9				
10				
11				
12				

“సీలింగ్ ఫ్యాన్” గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి, వేయించి నన్ను పార్లమెంటు అభ్యర్థిగా గెలిపించ ప్రార్థన...

మన ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి డా॥ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ


దర్శి: ఈవీఎంలు తీసుకెళ్లేందుకు సిద్ధమైన సిబ్బంది


మార్కాపురం: ఈవీఎంలను, పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది


ఒంగోలు: ఈవీఎంలను పరిశీలించుకుంటున్న సిబ్బంది

ఓటుకు వేళాయే..!

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎన్నికల సామగ్రి ఆదివారమే పోలింగ్ కేంద్రాలకు చేరింది. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. ఓటర్లంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు ఓటర్లంతా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయడమే తరువాయి.

– సాక్షి, ఒంగోలు


పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది


యర్రగొండపాలెం: పోలింగ్ సామగ్రి తీసుకొని కేంద్రాలకు వెళుతున్న సిబ్బంది


ఒంగోలు: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు


ఒంగోలు: పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు


సింగరాయకొండ: పోలింగ్ సామగ్రితో కేంద్రానికి చేరుకున్న సిబ్బంది, పోలీసులు, బలగాలు


ఒంగోలు: పోలింగ్ కేంద్రం వద్ద టాయిలెట్లు


ఒంగోలు: పోలింగ్ సామగ్రి తీసుకొని వెళుతున్న సిబ్బంది


మార్కాపురం: పోలింగ్ సామగ్రితో సిబ్బంది


ఒంగోలు: పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల వివరాలు


జరుగుమల్లి: నందనవనం పోలింగ్ కేంద్రంలో సిబ్బంది

క్లుప్తంగా

గుప్తనిధుల కోసం నందీశ్వర విగ్రహం తొలగింపు


నందీశ్వర విగ్రహాన్ని తొలగించి తవ్విన గుంత

బేస్తవారిపేట: గుప్తనిధుల కోసం ప్రసిద్ధ శైవ క్షేత్రం మోక్షగుండంలోని ముక్తీశ్వరక్షేత్రంలో నందీశ్వర విగ్రహాన్ని తొలగించిన సంఘటన శనివారం అర్ధరాత్రి సమయంలో జరిగింది. శివలింగం ఎదురుగా ఉన్న నందీశ్వర విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారు. నాలుగు–ఐదు అడుగుల లోతుకు తవ్వకాలు జరిపారు. గుడి పూజారి వేరే గ్రామానికి వెళ్లిన సమయం చూసుకుని ఈ చర్యకు పాల్పడ్డారు. ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- అన్ని డిపోల నుంచి స్పెషల్ బస్సులు
- దూర ప్రాంతాలకు బదులుగా జిల్లాలోని ప్రాంతాలపై ఫోకస్
- ఆర్టీసీ బస్సులు గణనీయంగా తగ్గింపు

ఒంగోలు:

ఓటర్లు సౌకర్యవంతంగా వెళ్లి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఇబ్బంది లేకుండా అన్ని డిపోల పరిధిలో ప్రత్యేక సర్వీసులు సిద్ధం చేసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చేవారి కోసం ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు 111 స్పెషల్ బస్సులు నడిపింది. ఇవి కాకుండా మరో 25 బస్సులు సోమవారానికి ఒంగోలు చేరుకోనున్నాయి. మూడురోజుల్లో హైదరాబాద్ నుంచి 100, చెన్నై నుంచి 8, బెంగళూరు నుంచి మూడు ఆర్టీసీ బస్సులు నడిపారు.

స్థానికంగా అదనపు బస్సులు...

ఎన్నికల నిర్వహణ కోసం 2019 ఎన్నికల్లో ఉమ్మడి ప్రకాశంలోని 8 డిపోల నుంచి 500కుపైగా బస్సులను జిల్లా యంత్రాంగం తీసుకుంది. ప్రస్తుతం విభజన ప్రకాశంలోని 5 డిపోల పరిధిలో కేవలం 130 బస్సులను మాత్రమే ఎన్నికల నిర్వహణకు వినియోగిస్తున్నారు. ఇవన్నీ కూడా పల్లెవెలుగులు మాత్రమే. ఈ నేపథ్యంలో పల్లెలకు ప్రజానీకం చేరుకునేందుకు వీలుగా ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడుపుతున్నారు. వాస్తవానికి కనిగిరి డిపో నుంచి 43 బస్సులు నిత్యం విజయవాడ తిప్పుతుంటారు. అయితే, స్థానిక ప్రయాణికుల సంఖ్య పెరగడంతో 4 బస్సులను కేవలం కనిగిరి–ఒంగోలుకు నడుపుతున్నారు. దీనివల్ల ఒకే బస్సు రెండు సార్లు కనిగిరికి నడిపేందుకు అవకాశం ఏర్పడింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని కందుకూరుకు 5, గిద్దలూరుకు 10, మార్కాపురం 12, దర్శి 5, కనిగిరి 10 సర్వీసులను అదనంగా నడుపుతున్నారు. రెగ్యులర్ సర్వీసులకు ఇవి అదనం. ఇవన్నీ ఒంగోలు డిపో నుంచి నడిపే బస్సులు. ఇవి కాకుండా మళ్లీ కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, పొదిలి డిపోల నుంచి మరో 3 సర్వీసులను అదనంగా నడుపుతున్నారు.

అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాం : ప్రజారవాణాధికారి బి.సుధాకరరావు

ఓటర్లు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. అన్ని డిపోల పరిధిలో దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. జిల్లా యంత్రాంగం కూడా ఎక్కువగా ప్రైవేటు బస్సులు వినియోగించుకోవడంతో ఆర్టీసీలో బస్సుల కొరత లేదు. దూర ప్రాంతాలకు గుంటూరు డిపో వారు విజయవాడ నుంచి ఒంగోలు వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. జిల్లా పరిధిలో ఎప్పుడూ పాతిక బస్సులు ఆపి ఉంచుతాం. కానీ, వాటిని కూడా నేడు ప్రయాణీల అవసరాలకు అనుగుణంగా రోడ్డుమీదకు తీసుకొచ్చాం. ప్రతిఒక్కరూ సౌకర్యవంతంగా వెళ్లి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆర్టీసీ కూడా భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు చేపట్టాం.

అమ్మవారి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి


గంగా భవానికి పూజలు చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి , నాయకులు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి

తాళ్లూరు (ముండ్లమూరు): అమ్మవారు అందరినీ చల్లగా చూడాలని, ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని గుంటి గంగాభవాని తల్లిని కోరుకున్నట్లు వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగాభవాని సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భాస్కర్‌రెడ్డికి నాయకులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వేదాశీర్వచనం తీసుకున్నారు. ఆయన వెంట జిల్లా కో ఆప్షన్ మెంబరు షేక్.ఆదాం షరీఫ్, వైఎస్సార్ నబోబ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ పోశం మధుసూదనరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, జిల్లా యూత్‌వింగ్ కమిటీ ప్రధాన కార్యదర్శి భీమిరెడ్డి నాగమల్లేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనరు వై శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ చిమటా సుబ్బారావు, సొసైటీ మాజీ డైరెక్టర్ గువ్వల వెంకట శ్రీనివాసరెడ్డి, మాజీ ఏఎంసీ డైరెక్టర్ గుజ్జుల యోగిరెడ్డి, ఐవీరెడ్డి, గూడా శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సయ్యద్ లతీఫ్, దుద్దుకూరి శ్రీనివాసరెడ్డి, పీ దేవదానం, గుజ్జుల వెంకటేశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి, కొనికి శ్రీనివాసరావు, కైపు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు


పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ దినేష్ కుమార్

యర్రగొండపాలెం: పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈవీఎంల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ, ఏపీఓ, ఇతర పోలింగ్ సిబ్బందితో ఆయన మాట్లాడారు. సిబ్బందికి పోలింగ్ కేంద్రాల వద్దే తగిన సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఏమైనా ఇబ్బంది కలిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో మొదటి పోలింగ్ కేంద్రమైన పాలుట్లకు వెళ్లేందుకు వాహనాలను సిద్ధం చేశామని, వారివెంట శాటిలైట్ ఫోన్‌కూడా పంపుతున్నామని, సెక్టర్ అధికారులు అక్కడికి వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేసుకుంటారని తెలిపారు. పోలింగ్ జరిగే ప్రతి రెండు గంటలకు ఒక సారి పోలింగ్ శాతాన్ని ఆర్వో ద్వారా మీడియాకు సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉదయం 7గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు వచ్చి తమ ఓటును వేసుకునేలా తగిన ఏర్పాట్లు చేశామని, దీని వల్ల పోలింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయనుకుంటే అక్కడే ఉన్న పోలీసుల దృష్టికి తీసుకొని వెళ్లాలని, అనుమతి లేని వ్యక్తులను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తమ వెంట తీసుకొనివెళ్లే సామాగ్రిని పోలింగ్ ముగిసిన తరువాత తమకు కేటాయించిన కేంద్రాల అధికారులకు అప్పగించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట ఆర్వో శ్రీలేఖ ఉన్నారు.

పసిప్రాణాలు బలిగొన్న నిద్రమత్తు


ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు సంధ్య, అశ్విని


ప్రమాదంలో గాయపడిన బాలికను పైకి లేపుతున్న స్థానికులు

- రాంగ్‌రూట్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ప్రాణాలు విడిచిన చిన్నారులు

చినగంజాం: డ్రైవర్ నిద్రమత్తు ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలి తీసుకుంది. హృదయ విదాకరమైన ఈ సంఘటన చినగంజాం రొంపేరు వంతెన సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసులు, హైవే సిబ్బంది అందించిన సమాచారం ప్రకారం ఆదివారం ఉదయం 7:45 గంటలకు ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు ఢీకొట్టిన సంఘటనలో ఇరువురు చిన్నారులు మృతి చెందగా ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి కాలు విరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. యల్లావుల వెంకటేశ్వర్లు ఉప్పుగుండూరులో స్వీట్లు తయారు చేసే పనిలో ఉంటున్నాడు. అతనిది బాపట్ల స్వగ్రామం కాగా 7 నెలలుగా ఉప్పుగుండూరులో నివాసముంటున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు యల్లావులు దేవి సంధ్య జస్విత, అశ్విని. ఆదివారం తన కుటుంబంతో కలిసి బాపట్లలో ఓటు వేసేందుకు బయలు దేరాడు. వెంకటేశ్వర్లు, అతని భార్య ఒక ద్విచక్ర వాహనంపై, మరొక ద్విచక్ర వాహనంపై అతనికి సోదరుడి వరుసైన వెంపరాల లక్ష్మణ్ అతనితో పాటు వెంకటేశ్వర్లు ముగ్గురు కుమార్తెలు బాపట్ల బయలుదేరారు. వారు రొంపేరు బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి చిన్నారుల తల్లిదండ్రులు ద్విచక్ర వాహనం వెనుకబడటంతో వారికోసం ఆగి వారు వచ్చిన తరువాత వీరి వాహనం బయలు దేరింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు రాంగ్ రూట్‌లో వచ్చి రోడ్డుకు ఎడమవైపున ఉన్న వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ సంఘటనలో యల్లావుల వెంకటేశ్వర్లు పెద్ద కుమార్తె దేవి సంధ్య(11), చిన్నకుమార్తె అశ్విని(7)లకు తీవ్రగాయాలయ్యాయి. మరొక కుమార్తె జస్విత సురక్షితం కాగా వాహనం నడుపుతున్న లక్ష్మణ్‌కు ఎడమ కాలు విరిగింది. తీవ్ర గాయాలపాలైన ఇద్దరు చిన్నారులను చీరాల వైద్యశాలకు తరలించగా వారు ఆ పాటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. కాలు విరిగిన లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. పొన్నూరుకు చెందిన నరేంద్రరెడ్డి హైదరాబాద్‌లో న్యూట్రిషనర్‌గా పనిచేస్తూ ఆదివారం ఉదయం తన భార్య, చిన్నారితో కలిసి ఒంగోలులో ఓటు వేసే నిమిత్తం కారులో బయలుదేరాడు. రొంపేరు బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వారు ముగ్గురు సురక్షితంగా ఉన్నారు. తమ ఇద్దరు చిన్నారులు తమ కళ్లముందే ప్రమాదానికి గురై చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాదంలో చనిపోయిన చిన్నారులకు చీరాల వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.


సంఘటనా స్థలంలో ఢీకొన్న వాహనాలు కారు, బైకు

ఓటరు టైమ్





ఒంగోలులో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

పల్లె నుంచి పట్నం దాకా అందరూ ఓట్ల పండగకు సిద్ధమయ్యారు. వజ్రాయుధం ద్వారా తమ నేతను ఎన్నుకునేందుకు మేము సైతం అంటూ ఉత్సాహంగా పోలింగ్ బూత్‌లవైపు అడుగులు వేసేందుకు సంసిద్ధులవుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం ప్రచారపర్వం ముగియగా సోమవారం పోలింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఎన్నికల సామగ్రి ఇప్పటికే ఆయా పోలింగ్ కేంద్రాలు చేరిపోయాయి.

ఎన్నికల బరిలో అభ్యర్థులు	పార్లమెంట్	అసెంబ్లీలు	అభ్యర్థులు	అత్యధికం
	25 మంది	8	140 మంది	మార్కాపురం 27 మంది

పోలింగ్ సమయం
ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

పోలింగ్ కేంద్రాలు	సమస్యాత్మక కేంద్రాలు
2183	486

ఎన్నికల విధుల్లో ఉద్యోగులు: 20 వేల మంది

సెక్టోరల్ అధికారులు	నోడల్ అధికారులు
263 మంది	16 మంది

అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నంబర్: 1950

జిల్లాలో ఓటర్లు: 18,22,470 మంది

పురుషులు	మహిళలు	ఇతరులు
9,07,980	9,14,379	111

- నేడు పోలింగ్
- పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం
- జిల్లా కమాండ్ కంట్రోలు కేంద్రం నుంచి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియ పరిశీలన
- 100 మీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్, 200 మీటర్ల అవతలే రాజకీయ పార్టీల సహాయ కేంద్రాలు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరుగనుంది. ఎన్నికల నిబంధనల మేరకు రాజకీయ పార్టీల ప్రచారాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. ఆదివారం జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు నిర్దేశించిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రి తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పోలింగ్ నిర్వహణ ఏర్పాట్లు, పోలింగ్ సమగ్రి తరలింపును పర్యవేక్షించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గం లో ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు 48 గంటల పాటు మద్యం దుకాణాలను మూసి వేశారు. అంతేకాకుండా రాజకీయ పార్టీల ప్రచారానికి వచ్చిన ఇతర జిల్లాల వారిని తిరిగి వారి జిల్లాలకు పంపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, షామియానాలు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా 200 మీటర్ల అవతల రాజకీయ పార్టీలు ఎన్నికల సంఘం నిర్దేశించిన సైజులో షామియానా ఏర్పాటు చేసుకుని ఓటర్లకు అవసరమైన స్లిప్‌లు ఇవ్వవచ్చు. ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలతో పాటు ఎవరైనా గొడవలు చేస్తే వారిపై కఠిన చర్యలకు యంత్రాంగం సిద్ధమైంది. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది రవాణాకు ఇబ్బంది లేకుండా నియోజకవర్గాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను సైతం ఏర్పాటు చేసింది.



గిద్దలూరులో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

8 డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, 5 ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూములు

పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రి అందజేసేందుకు జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదివారం పోలింగ్ సామగ్రి తరలించారు. అదేవిధంగా సోమవారం జరిగే పోలింగ్ అనంతరం ఈవీఎంలను జమ చేసేందుకు నియోజకవర్గాల వారీగా జిల్లాలో 5 ఇంటిగ్రేటెడ్ స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జిల్లాలోని మొత్తం నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను ఒంగోలు రైజ్ ఇంజినీరింగ్ కాలేజిలోని స్ట్రాంగ్ రూముకు తరలిస్తారు. ఓట్ల లెక్కింపు వరకూ పటిష్టమైన భద్రతల నడుమ వాటిని ఉంచుతారు.

5 గంటల నుంచి మాక్ పోలింగ్

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, ఇతర సామగ్రిని సిద్ధం చేశారు. ఉదయం 5 గంటలకు పోలింగ్ అధికారులు రాజకీయ పార్టీల ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. అనంతరం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభమవుతుంది. పోలింగ్ బూత్‌లోకి వచ్చిన ఓటరుకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులను పరిశీలించి ఓటు వివరాలను పరిశీలిస్తారు. అనంతరం పార్లమెట్ నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన స్లిప్‌ను అందజేసి వేలిపై ఇంకు చుక్క వేసి ఓటు వేసేందుకు ఈవీఎంల వద్దకు పంపుతారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పర్యవేక్షణ:
జిల్లా కేంద్రంలోని ప్రకాశం భవనంలో 16 మంది నోడల్ అధికారులతో వివిధ విభాగాలతో ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేలా పెద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు నియోజకవర్గ స్థాయిలోను కమాండ్ కంట్రోలు రూములు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోలు కేంద్రాల్లో సీ-విజిల్ ద్వారా ఫిర్యాదులు తీసుకుని 100 నిమిషాల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలకు సంబంధించి అవసరమైన అనుమతులను నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఈ సేవలతో పాటు 1950 టోల్‌ఫ్రీ నంబర్, వ్యయ కమిటీలు, స్వీప్, మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్, సింగిల్ విండో అనుమతులు వంటి సేవలు కంట్రోలు రూములో ఏర్పాటు చేశారు. జిల్లాకు వచ్చిన ఎన్నికల పరిశీలకులు సైతం ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.



ఒంగోలులో ఈవీఎంను సరిచూసుకుంటున్న సిబ్బంది

రూ.5 కోట్ల పైగా నగదు, వస్తువులు సీజ్
జిల్లాలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ఎన్నికలకు ప్రలోభ పెట్టేలా అధిక మొత్తంలో డబ్బు, మద్యం, ఇతర వస్తువులను పట్టుకునేలా తనిఖీలు నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు రూ.5 కోట్ల మేర నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశారు.

ఎన్నికల విధుల్లో 20 వేల మందికి పైగా అధికారులు, సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేలకు మందికిపైగా అధికారులు, ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నికల విధుల్లో ముఖ్యమైన సెక్టోరల్ ఆఫీసర్లుగా 263 మందిని నియమించారు. సరాసరి ప్రతి పది పోలింగ్ కేంద్రాలకు ఒక సెక్టోరల్ ఆఫీసర్ చొప్పున నియమించి ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లాలో సెక్టోరల్ అధికారులతో పాటు నియోజకవర్గానికి ఒక ఆర్ఓ (రిటర్నింగ్ అధికారి) చొప్పున ఎనిమిది నియోజకవర్గాలకు 8 మంది, 46 మంది ఏఆర్ఓలు, 16 మంది జిల్లా స్థాయిలో నోడల్ అధికారులు, నియోజకవర్గానికి 3 నుంచి 4 చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, సర్వేలెన్స్ బృందాలు 16, అకౌంటింగ్ బృందాలు 8, అసిస్టెంట్ అబ్జర్వర్లు 16 మందితో పాటు పోలింగ్ సిబ్బందిని సిద్ధం చేశారు. వీరితో పాటు 50 మంది జిల్లా అధికారులు, 25 మంది మండల స్థాయి అధికారులు ఎన్నికల విధుల్లో పనిచేస్తున్నారు. మొత్తం మీద జిల్లాలో ఎన్నికల విధుల్లో 20 వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగే పోలింగ్ ప్రక్రియలో పీఓ (ప్రిసైడింగ్ ఆఫీసర్), ఏపీఓ, ఓపీఓలతో కలిపి మొత్తం 14,768 మంది విధులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా పోలింగ్ సిబ్బందిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ నియమించారు.

నియోజకవర్గం	పీఓలు	ఏపీఓలు	ఓపీఓలు
యర్రగొండపాలెం	302	302	1196
దర్శి	321	321	1268
సంతనూతలపాడు	292	292	1152
ఒంగోలు	295	295	1164
కొండపి	322	322	1272
మార్కాపురం	293	293	155
గిద్దలూరు	321	321	1271
కనిగిరి	335	335	1328





మార్కాపురంలో పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

నియోజకవర్గం వారీగా ఓటర్ల వివరాలు ఇవీ:

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
యర్రగొండపాలెం	105230	101982	2	207214
దర్శి	114233	112129	8	226370
సంతనూతలపాడు	105497	109137	4	214638
ఒంగోలు	115495	124694	53	240242
కొండపి	118624	120982	3	239609
మార్కాపురం	408043	106557	8	214608
గిద్దలూరు	119502	120188	20	239710
కనిగిరి	121356	118710	13	240079
మొత్తం	1207980	914379	111	1822470

జిల్లాలో పోలింగ్ కేంద్రాలు ఇవీ...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పోలింగ్ కేంద్రాలు ఉన్న లోకేషన్‌లు	సమస్యాత్మక కేంద్రాలు
యర్రగొండపాలెం	265	29	57
దర్శి	282	27	58
సంతనూతలపాడు	256	48	75
ఒంగోలు	259	18	53
కొండపి	283	33	69
మార్కాపురం	257	45	68
గిద్దలూరు	284	34	56
కనిగిరి	297	25	48
మొత్తం	2183	259	484



కనిగిరిలో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న సిబ్బంది

ఎన్నికలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



ఈ నెల 13వ తేదీ జరిగే పోలింగ్ రోజు ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయి. ఆ మేరకు ఎన్నికల విధులు నిర్వహించే యంత్రాంగంతో పాటు పోలీసు శాఖ అప్రమత్తంగా ఉంది. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించి జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలి. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది మార్గదర్శకాల మేరకు ఖచ్చితమైన విధులు నిర్వహించేలా అన్నీ చర్యలు తీసుకున్నాం. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల ఫాలోవర్స్ అందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి.

– **కలెక్టర్ దినేష్‌కుమార్,** జిల్లా ఎన్నికల అధికారి



ఒంగోలులో పోలింగ్ సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాలకు
సామగ్రి తరలింపు

- జిల్లా వ్యాప్తంగా ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: నేడు జరిగే సార్వత్రిక పోరుకు సంబంధించి పోలింగ్ కోసం అవసరమైన ఈవీఎంలు, ఇతర సమగ్రిని జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలకు ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఆదివారం తరలించారు. ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి రాజీవ్‌గాంధీ యూనివర్శిటీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి సమగ్రిని తరలించారు. 259 పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, అడిషనల్ అధికారులు, రూట్ అధికారులు ఆయా పోలింగ్ కేంద్రాలకు పార్లమెంట్ అభ్యర్థికి ఒక సెట్టు ఈవీఎం, అసెంబ్లీ అభ్యర్థికి ఒక సెట్ ఈవీఎం, ఇతర పోలింగ్ సమగ్రిని పోలీసు భద్రతతో ఆర్టీసీ బస్సుల ద్వారా తరలించారు. రిజర్వు ఈవీఎంలను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద ఉంచుతారు. అవసరాన్ని బట్టి వాటిని వినియోగిస్తారు. ఒంగోలు నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్‌ను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి, పార్లమెంట్ ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి, ఒంగోలు నియోజకవర్గ ప్రత్యేక అధికారి విశ్వేశ్వరరావు, ఓఎంసీ కమిషనర్ జస్వంతరావు, తహశీల్దారు సృజన్, వైఎస్ఆర్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్ ఇతర పార్టీల ప్రతినిధులు పరిశీలించారు. అదేవిధంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, దర్శిలోని ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజిలోని కేంద్రం, సంతనూతలపాడు నియోజకవర్గానికి ఎండ్లూరు వద్ద ఉన్న ట్రిబుల్ ఐటీ కాలేజీలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కొండపికి రైజ్ ఇంజినీరింగ్ కాలేజి, మార్కాపురానికి ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజి, గిద్దలూరుకు పాల్స్ కాలేజి, కనిగిరి నియోజకవర్గానికి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రక్రియను జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వెళ్లి పరిశీలించారు.



పాలుట్ల వ్యూ

నాడు హెలికాప్టర్‌లో..
నేడు జీపుల్లో..

- పోలింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు

యర్రగొండపాలెం: దట్టమైన నల్లమల అడవుల్లోని పాలుట్ల గిరిజనగూడెం మావోయిస్టుల ప్రభావిత ప్రాంతం. అక్కడికి వెళ్లాలంటే దాదాపు 42 కిలోమీటర్లు అడవి మార్గంలో ప్రయాణించాలి. అంతేకాకుండా రోడ్డు మార్గంలో వెళ్లటానికి అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. పోలింగ్ ముగిసిన తరువాత తిరిగి సిబ్బంది అడవిలో వెనుతిరగడం ప్రమాదం. ఈ కారణాలను గుర్తించిన ప్రభుత్వం 1999లో జరిగిన ఎన్నికలకు పోలింగ్ మెటీరియల్‌తోపాటు పోలింగ్ సిబ్బందిని హెలికాప్టర్‌లో తీసుకొని వెళ్లి అక్కడ పోలింగ్ జరిపారు. ప్రస్తుతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమాండర్ జీపుల్లో అక్కడికి పోలింగ్ సిబ్బంది వెళ్లి ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే తిరిగి యర్రగొండపాలెంలోని ఈవీఎంలు భద్రపరిచే ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్దకు చేరుతారు.



పాలుట్లకు వెళ్లే దారి ఇది

బయలు దేరుతున్న కమాండర్ జీపులు